క్లుప్తంగా

క్రీడాసామగ్రి అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన విద్యార్థులకు ఆదివారం బాల్కొండలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రూ.50వేల విలువ గల క్రీడాసామగ్రిని అందించారు. దాత ఏనుగు దయానంద్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు ఈ సామగ్రిని ఇప్పించినట్లు స్కూల్ హెచ్‌ఎం చంద్రవతి, ఫిజికల్ డైరెక్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, దాత దయానంద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రాజంపేట : మండలంలో ఇటీవలవర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు కోరారు. ఆదివారం రాజంపేట రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు మర్రి గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవి పందులు, కోతులు, చిలుకల కారణంగా రైతులు తీవ్రంగా పంట నష్టపోతున్నారన్నారు. వరద బీభత్సం సృష్టించి పంట చేలల్లో ఇసుకమేటలు వేశాయన్నారు. అలాగే ప్రభుత్వం రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 12లోపు ప్రవేశం పొందాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కొనసాగుతున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీసెంటర్‌లో ఈనెల 12వరకు ప్రవేశాలు పొందాలని అధ్యయనకేంద్రం సమన్వయకర్త డా. గంగాధర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీసెంటర్‌లో కొనసాగుతున్న వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలన్నారు. 2024–25లో ప్రవేశం పొందిన వారు రెన్యువల్ చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వివరాలకు www.braouon.line.in ను సంప్రదించాలని సూచించారు.

తండాలను సందర్శించిన మధుయాష్కిగౌడ్



రాజంపేట: మండలంలో వరదలకు ప్రభావితమైన గుండారం, ఎల్లాపూర్ తండా, నడిం తండా, పలుగుట్ట తండాల్లో ఆదివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పర్యటించారు. వరదలకు జరిగిన నష్టాన్ని దెబ్బతిన్న ఇళ్లు, పంటలు, రోడ్లను పరిశీలించారు. తండాలల్లో గిరిజనులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి మరమ్మతులు చేసి తండాలకు విద్యుత్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని సూచించారు. అనంతరం శేషాద్రి ఇండస్ట్రీ సహకారంతో వరద బాధితుకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆకుల శ్రీనివాస్, లింగాగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్ రెడ్డి, నాయకులు సంపత్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సల్మాన్, మదన్‌లాల్ పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్'పై శిక్షణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో సోమవారం 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్'(యస్‌హెచ్‌వీఆర్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మోడల్‌స్కూల్ హెచ్‌ఎంలు శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వాలని ఆయన సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్‌ఎంలకు యస్‌హెచ్‌వీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి పాత గ్రామంలో తీవ్రనీటి ఎద్దడి ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని వీడీసీ మాజీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ నీళ్లు గత పదిరోజులుగా రావడం లేదని, అలాగే కమ్యూనిటీ బోర్లు పనిచేయడం లేదన్నారు. ముఖ్యంగా 10వ వార్డులో పరిస్థితి దారుణంగా తయారైందని, ముత్యాలమ్మ గుడి వద్ద నీళ్లట్యాంకుకు నీరందించే బోరు చెడిపోగా మరమ్మతులు చేయడం లేదని, అలాగే డైరెక్ట్ బోర్లు పనిచేయడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు కనీసం క్షేత్రస్థాయి పరిశీలన చేయడం లేదని వాపోయారు.

సమస్యలతో చదువులు సాగేదెలా?

- తాడ్వాయిలో అరకొర వసతులతో జూనియర్ కాలేజీ
- నీటి సౌకర్యం కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, అధ్యాపకులు
- అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వినతి



తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నిరుపేద విద్యార్థులు 10వ తరగతి అనంతరం మధ్యలో చదువును ఆపేయకుండా కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేసింది. తాడ్వాయి జూనియర్ కాలేజీలో 166 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ కోర్సులు కొనసాగుతున్నాయి. కాలేజీ మౌలిక సదుపాయాలు లేక అరకొర వసతులతో కొనసాగుతోంది. కాలేజీలో సరిపడా గదులు లేక పోవడంతో వరండాలు, ఆఫీసు కార్యాలయంలోనే విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. అలాగే ప్రహరీ నిర్మించలేదు.దీంతో వనమహోత్సవంలో కాలేజీ ఆవరణలో నాటిన మొక్కలు పశువుల మేతకు అవుతున్నాయి. కళాశాల ఆవరణలో బోర్లు వేసినప్పటికి అందులో నీరు పడలేదు. దీంతో విద్యార్థులు తాగునీటి కోసం కిలోమీటర్ దూరం వరకు నడిచి హోటళ్లు, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. అలాగే ప్రాక్టికల్ చేయడానికి ప్రత్యేక గదులు లేవు. నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు, మూత్రశాలలను పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. దీంతోపాటు కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి కళాశాల వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కాలేజీలో వసతులు లేకపోవడంతో గురుకుల పాఠశాలలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. కళాశాలలో బోధించే అధ్యాపకులు సరిపడా ఉన్న కనీస వసతులు లేక విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు వెళ్తున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలేజీ ప్రహరీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



కళాశాలలో ప్రహరీ నిర్మించాలి. ప్రహరీ నిర్మించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. పరీక్షా సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. అదనపు గదులను కూడా నిర్మించాలి. అలాగే. తాగునీటి కోసం కిలోమీటర్ దూరం పోవాల్సి వస్తుంది.

– కృష్ణవేణి, విద్యార్థిని ద్వితీయ సంవత్సరం

తాగునీటి సమస్యను తీర్చాలి



కాలేజీలో తాగునీటి సమస్యను తీర్చాలి. అధికారులు, చొరవ తీసుకొని కళాశాల ఆవరణలో బోరువేయించాలి. నీళ్లకోసం హోటళ్లను ఆశ్రయిస్తున్నాం. ప్రాక్టికల్ కోసం ప్రత్యేక తరగతి గదులను నిర్మించాలి.

– వంశి, విద్యార్థి మొదటిసంవత్సరం

ప్రతిపాదనలు పంపాం



కాలేజీలో మౌలిక వసతుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కళాశాలలో ప్రహరీ నిర్మాణానికి, అదనపు గదులు, రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు వివరించాం.

– సయ్యద్ యూసూఫ్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపల్

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



అడ్లూర్ ఎల్లారెడ్డిలో గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న రైతు యువజన సంఘం సభ్యులు



ఎల్లారెడ్డిలో గణేశ్ విగ్రహాల శోభాయాత్ర



శోభాయాత్రలో యువకుల డ్యాన్సులు



ఎల్లారెడ్డి పెద్దచెరువు, బాన్సువాడ కల్కిచెరువులో నిమజ్జనమవుతున్న వినాయక విగ్రహాలు



పాల్కంపేటలో తరలుతున్న వినాయకులు



దోమకొండలోని కుడిచెరువులో నిమజ్జనమవుతున్న వినాయక విగ్రహం

సదాశివనగర్/ఎల్లారెడ్డి/లింగంపేట/బాన్సువాడ/ దోమకొండ: జిల్లాలో పలు చోట్ల ఆదివారం వినాయక శోభాయాత్ర ప్రశాంతం జరిగింది. స్థానిక చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. ఈసందర్భంగా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బంజార సేవా సంఘ్ యూత్ కమిటీ ఎన్నిక



మద్నూర్(జుక్కల్): మండల బంజార సేవా సంఘ్ యూత్ కమిటీని ఆదివారం ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పవార్ రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ సంతోష్, కోశాధికారిగా రాథోడ్ సునీల్, ఉపాధ్యక్షులుగా రాథోడ్ శ్రీనివాస్, రాథోడ్ సంజయ్, గౌరవ అధ్యక్షులు రాథోడ్ శ్రవణ్, సహాయ కార్యదర్శి రాథోడ్ రవి, రాథోడ్ రామ్‌దాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాథోడ్ సురేందర్, మండల అధ్యక్షులు శివాజీ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహన్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ రాథోడ్ ఉన్నారు.

ఇస్రోజీవాడి చైతన్య యువజన సంఘం..



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఏడాది కాలం పాటు కొనసాగుతుందని తెలిపారు. అధ్యక్షుడిగా లోకోటి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల రాజశేఖర్, కార్యదర్శిగా లోకోటి ప్రశాంత్, కోశాధికారిగా కంచర్ల శ్రీకాంత్, సలహాదారులుగా లోకోటి రాజశేఖర్, మానేటి ప్రతాప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 30 మంది సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.55 వేలు పలికిన లడ్డూ



లడ్డూను దక్కించుకున్న అంకాలపు నర్సింలు



దేవాయిపల్లిలో.. దక్కించుకున్న సురేష్‌రెడ్డి

దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరం వినాయక శోభాయాత్ర సందర్భంగా శనివారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించారు. లడ్డూను గ్రామానికి చెందిన అంకాలపు నర్సింలు రూ.55 వేలకు దక్కించుకున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు తెలిపారు.

అదేవిధంగా స్థానిక శివరామందిర్ ఆలయ గణపతి వద్ద లడ్డూను గ్రామానికి చెందిన బొంబ్లొతుల రాజనర్సాగౌడ్ రూ.31 వేలకు దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ అంజం తెలిపారు.

దేవాయిపల్లిలో రూ.8,301లు పలికిన లడ్డూ

తాడ్వాయి : మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో మా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద శనివారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంలో లడ్డూను రూ.8301కి గ్రామానికి చెందిన పైడి సురేష్ రెడ్డి దక్కించుకున్నారు.

నాచుపల్లిలో సమస్యల తిష్ట



నాచుపల్లిలో మురికి కాలువలో నీరు పట్టుకుంటున్న ఎస్సీ కాలనీవాసులు



కుక్క కాటుకు గురైన బాలుడు (ఫైల్)

నస్రుల్లాబాద్ : మండలంలోని నాచుపల్లి గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురికి కాలువలు నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వీధులన్ని పిచ్చి మొక్కలు మొలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పలు ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు మొలిచి పాములు, ముంగీసలు వచ్చి ఇళ్ల ముందటే కొట్టుకుంటున్నాయి. దీంతో భయాందోళన చెందుతున్నారు.

తాగునీరు లేక అవస్థలు

గ్రామంలోని ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ పైపు లైన్ వేసిన నాటి నుంచి నీటి సమస్య ఉంది. ఈపైపు లైన్ కూడా మురికి కాలువలో ఉంది. దీంతో తాగడానికి మాత్రమే కాదు వాడుకోవడానికి పనికి రాకుండా నీరు వస్తున్నాయి. వర్షాకాలం మురికి కాలువలో ఉన్న పైపు నుంచి నీరు తీసి వాడుకుంటే వాసన వస్తున్నాయి. ఈ విషయం పలుమార్లు పంచాయతి సిబ్బందికి తెలిపినా కూడా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల బెడద

గ్రామంలో కుక్కలు బెడద పెరిగిపోయింది. ఇటీవల ఒకే రోజు ఇద్దరు చిన్నారులను కుక్కలు కరిచాయి. నెలరోజులు వ్యవధిలో గ్రామంలో ఏడుగురు కుక్కకాటు బాధితులు ఉన్నారు. కుక్కల బెడద తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాబోయ్ కుక్కలు..



బోర్లంక్యాంపులో సంచరిస్తున్న కుక్కల గుంపు

బాన్సువాడ రూరల్: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పంచాయతీల్లో నిధుల కొరత మూలంగా వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఏ వీధిలో చూసిన పదుల సంఖ్యలో కుక్కల మందలు తారాసపడుతున్నాయి. చిన్నారులు వీధిలో స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. హాస్పిటల్స్‌కు వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కలను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బతుకమ్మ కుంట పరిశీలన



పాల్కంపేట శివారులోని బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పాల్కంపేట శివారులోని బతుకమ్మ కుంటను ఆదివారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. భారీ వర్షాలకు కుంటకు గండి పడింది. దాంతో కుంటలోని నీరంతా ఆయకట్టు కిందికి వెళ్లడంతో పంట పొలాల్లో ఇసుక మేటలు వెలిసాయి. బతుకమ్మ కుంట ఆయకట్టు రైతులకు చెందిన పంట పొలాలు ధ్వంసమైన వారి వివరాలు సేకరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. సేకరించిన వివరాలు ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, కార్యదర్శి అశ్వక్, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్ట..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్ట వద్ద గణేశ్ నిమజ్జనాన్ని ఆర్డీవో పార్థసింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. పెద్ద చెరువు వద్ద గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. చెరువు కట్ట పైకి ఎవరికి అనుమతించొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, ఫైర్ సిబ్బంది తదితరులున్నారు.

వరద బాధితులకు సహాయం



బాధితులకు సహాయం అందిస్తున్న జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

కామారెడ్డి అర్బన్: బ్రాహ్మణ వికాస పరిషత్, జిల్లా బ్రాహ్మణ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక త్రిశక్తి ఆలయంలో కామారెడ్డి వరద బాధితులకు సహాయం అందించారు. బ్రాహ్మణులకు చెందిన ఐదు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సహాయం, వస్త్రాలు, నిత్యావసర వస్తువులు అందజేసినట్లు బ్రహ్మణ వికాస పరిషత్ అధ్యక్షుడు సి.అర్జున్‌రావు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌శర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు జే.రాంమోహన్, ఎస్.భాస్కర్‌రావు, బి.సతీష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, నాగచందర్, చక్రధర్, చైతన్యకుమార్, వేణుగోపాల్‌శర్మ, మధుసూదన్‌రావు, శశిధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని జీఆర్, హౌసింగ్‌బోర్డు, బతుకమ్మ కుంట, శ్రీనగర్, టీచర్ కాలనీ వరద బాధితులకు రూ.5లక్షల విలువగల వస్త్రాలు, నిత్యావసర సరకులు, స్టీల్‌ప్లేట్లను హైదరాబాద్‌కు చెందిన వాసవీ శ్రీనిలయం రెసిడెంట్ సొసైటీ అందించింది.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొత్త శ్రీకాంత్, ప్రతినిధులు పి.శ్రీనివాస్‌రెడ్డి, జే.నాగరాజు, డి.నారాయణరావు, ప్రకాష్‌రావు, షేక్ అక్బర్, పట్టణానికి చెందిన వారి మిత్రులు సహేందర్‌నాథ్, కమ్మరి భాస్కర్, గంగాకిషన్, మజార్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవార్డులు



హైదరాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకుంటున్న నాగరాజు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

బాన్సువాడ/కామారెడ్డి అర్బన్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదివారం అవార్డులు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఈఅవార్డులను అందజేశారు. బీర్కూర్‌కు చెందిన ఎస్జీటీ ఏనుగుల నాగరాజును ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడంతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రమేష్, మేకల విఠల్, గాలప్ప, కొట్టూరి సంతోష్ తదితరులున్నారు. చిన్న మల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ వి.రామకృష్ణను ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు.జిల్లాకు ఒక్కో ఉత్తమ ఉపాధ్యాయుడిని విద్యావిలువలు, నైతికత, క్రమశిక్షణ బోధన అంశాల్లో ఎంపికచేసి లయన్స్ క్లబ్ తరఫున సన్మానించినట్లు 320–డి కామారెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సంక్షిప్తం

ఖతర్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణానికి చెందిన సాలంబిన్ ఈసా సౌదీ అరేబియాలోని ఖతర్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నట్లు అతని తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఈసాబిన్ అలీ తెలిపారు. ఇండియన్ కల్చర్ సెంటర్ ఆధ్వర్యంలో అవార్డును ప్రధానం చేశారన్నారు. విదేశాల్లో ఉపాధ్యాయ వృత్తిలో స్థిర పడిన సాలంబిన్ ఈసా అవార్డు అందుకుని భారతదేశ ఖ్యాతిని పెంపొందింప జేయడం హర్షనీయమని పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాలెఖ్, ఎండీ దావూద్‌లు ప్రశంసించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



భిక్కనూరు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న ముదాం స్వామిని మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఆదివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఛత్రపతి శివాజి మెమెంటోను ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జంగంపల్లి అధ్యక్షుడు మెడుదల రాజయ్య ప్రతినిధులు నర్సింలు, తిరుమలేష్,రమేష్, భాస్కర్, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడికి ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం పీఆర్టీయూ తెలంగాణా కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన అంబిర్ మనోహర్‌రావును ఆదివారం ఆర్యక్షత్రీయ సంఘ సభ్యులు సన్మానించారు.కార్యక్రమంలో సభ్యులు, నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్యక్షత్రీయ సంఘ నాయకులకు..

కామారెడ్డి అర్బన్: ఆర్యక్షత్రీయ సంఘాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇస్తు కృషి చేస్తున్నందుకు శ్రీకృష్ణ ధాన్యమందిరం శ్రీమంత్ మాచాలే బాబాతో పాటు సదాశివనగర్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పడిగెల రాజేశ్వరరావు, సంఘం జిల్లా కార్యదర్శి వజీర్ శివాజీరావులను శనివారం రాత్రి ఆర్యక్షత్రీయ అశోక్‌నగర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కిషన్‌రావు, ప్రతినిధులు గంగాధర్‌రావు, మోహన్‌రావు, హరికిషన్‌రావు, సుధాకర్‌రావు, శ్యాంరావు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

దోమకొండ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.